కథా నిలయం
5670
శ్రీకాకుళం

యస్.వివేకానంద

# చీట్లు - పాట్లు

సుబ్బమ్మగారంటే కేదారేశ్వరపేట అబ్బా అనాలి! అదీ.. ఆమె తెలివి తేటల దెబ్బంటే! ఆమేం పెద్దగా చదుకున్నది కాదు. ఏదో వానాకాలం చదవు! మనిషి పొడగరి! దృఢంగా ఆరోగ్యంగా ఉంటుంది. పాతిక కిలోల బస్తా అవలీలగా భుజాన వేసుకుని ఇల్లు చేరుకోగల శక్తిమంతురాలు!

విజయవాడ సిటీలో కేదారేశ్వరపేటంటే... నలభై ఏళ్ల క్రితం అప్పుడప్పుడే డెవలప్ అవుతున్న ఏరియా కిద లెఖ్ఖ! అక్కడ ప్లాట్లు అమ్మకం జరిగినా ఎవ్వరూ మొదట్లో ఇళ్లు కట్టుకొను సాహసించలేదు. కాకుంటే... కూతవేటు దూరంలో సిమెంట్ ఫ్యాక్టరీ వుంది కాబట్టి వచ్చిపోయే వాహనాలతో రద్దీ వుండే ప్రాంతం కదా అని ఒకరిద్దరు ఇళు కట్టుకున్నారు. ఆ కాలనీలో మూడో ఇల్లే సుబ్బమ్మది.

అలా ఏడాది కాలంలో ఇళ్లు పెరిగాయి. కాలనీలో సందడి ఎక్కువైంది.

దూరాలోచనలో ఉన్న సుబ్బమ్మ కాలనీ వాసుల కోసం చిల్లర కొట్టు పెట్టింది. అడిగిన వారికి అప్పులిస్తూ ఆత్మీయతను పదిమందికి పంచింది. ఆరు నెలలు తిరగకుండానే పిండి ఆడించే మిషన్... గ్రైండర్ కొని వ్యాపారాన్ని వృద్ధి చేయటానికి పునాదులు వేసింది.

సుబ్బమ్మ భర్త మనిషి మేధకుడు! ఇంట్లో ఫిమేల్ డామినేషన్! భర్త వాయిస్‌లెస్ కావటానికి కారణం... పెత్తనం సుబ్బమ్మదే! భర్త రామనాథం అమోగ్యుడు కాకపోయినా సిమెంట్ డీలర్ దగ్గర ఉద్యోగం చేస్తూ నెలకు నాలుగు వేలు ఆర్జిస్తుంటాడు.

సుబ్బమ్మ వాగ్ధోరణి, మాటల చాకచక్యాలకు ఎలాంటి వారైనా బుట్టలో పడిపోవాల్సిందే. ఆమె మాటల మేధావి! మరో నాలుగేళ్లు గడిచేసరికి కాలనీలో నాలుగు వందల ఇళ్లు పెరిగాయి. అక్కడక్కడ శ్రమజీవుల గుడిసెలు వెలిశాయి!

కాలనీవాసులందరికీ సుబ్బమ్మే రింగ్‌లీడర్! మాట సహాయం కోసం, అప్పుకోసం ఇతర ప్లాన్ల కోసం సుబ్బమ్మను ఆశ్రయించి ఆమె చెప్పినట్టే నడుస్తారు వారంతా!

ఆమె మాట కాలనీవాసులందరికీ వేదవాక్కు. మునిసిపల్ ఎన్నికల్లో ఆమె కాలనీలో నిలబడితే కౌన్సిలర్ ఏకగ్రీవంగా ఎన్నిక అవడం ఖాయం! సుబ్బమ్మ

దంపతులకు నలుగురూ ఆడపిల్లలే కావటం, పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యాపారం మీద వచ్చే ఆదాయం సరిపోవడం లేదని అనిపించడంతో చీట్ల వ్యాపారం మీదకి ఆమె దృష్టి మళ్ళింది. ఆలోచన వచ్చీరాగానే కార్యచరణ మొదలుపెట్టింది. కాలనీలో ఉన్న మహిళలందరినీ సమావేశపరిచి తన ప్లాన్ ఆఫ్ యాక్షన్ వారందరికీ వివరించింది.

ఇంకేముంది... ఆడవారంతా తలలూపారు. ప్రారంభదశలో పదివేలు... అయిదువేలు... వెయ్యి రూపాయల చీట్లకు ప్రాధాన్యత ఇచ్చింది సుబ్బమ్మ. ఏ చీటీ అయినా సరే మొదటిది దేవుడిపాట కింద మొత్తం చీటి డబ్బు తాను తీసుకునేటట్టు వప్పందం కుదుర్చుకుంది.

రానురాను చీటీ వ్యాపారం లాభసాటిగానే ఉన్నదని అనిపించింది అందరికీ! వారి వారి అవసరాలకు చీటీ పాట పాడుకునే విధానం నచ్చింది సభ్యులందరికీ!

చూశారా నా తఢాకా...! మీరట్లే చూస్తూండండి. ఒకనాటికి మనం కూడా లక్షాధికారులమవుతాం... భోజనం వడ్డిస్తూ భర్తతో అంది సుబ్బమ్మ.

'నీ తెలివితేటలు నాకు తెలియవనుకున్నవా... నీ దెబ్బకు ఎదురుండదు. నిన్ను మించిన వాళ్లు మన కాలనీలో, ఈ రాష్ట్రంలోనే కాదు మన దేశంలోనే ఉండరు.

మీ పొగడ్తలెవ్వరిక్కావాలి? ఆడదాన్నయినా నేను ఎంత శ్రమపడుతున్నానో కళ్ళారా చూస్తున్నారుగా?! నాకిన్ని తెలివితేటలే లేకుంటే... కాదు కాదు... ఆ దేవుడు ఇచ్చి ఉండకపోతే మీకొచ్చే నాలుగు వేల జీతంతో కొంప గడిచేనా? పిల్లలను కాన్వెంట్‌లో

చదివించగలిగేవాళ్లమా? వాళ్ల పెళ్ళిళ్ల కోజం బోలెడంత డబ్బు కూడబెట్టాల్సి వస్తుంది. ఆ పని మీ వల్ల ఏం అవుతుందా? అంటూ సెల్ఫ్ డబ్బా వాయించుకుంది సుబ్బమ్మ.

అందుకేనే నువ్వీ రాష్టానికి ముఖ్యమంత్రివో, దేశానికి ప్రధానమంత్రివో అయివుండాల్సిన దానివి! దేవుడు నీ పట్ల చిన్నచూపు చూశాడు. ఏం చేస్తాం?!

చాల్లెండి బడాయి! అంత పెద్ద పెద్ద ఆశలు నాకు లేవు. మనం మధ్యతరగతి వాళ్లం! లోటు లేకుండా మన అవసరాలు గడిస్తేచాలు! నేపడే కష్టమంతా అందుకోసమే.

అవుననవును నాడు తెలీదా ఏం? ఇక పెరుగు వడ్డించు! నీకు ఇంఓ తమాషా అయిన విషయం చెప్పనా? నా పేరేమిటో నేను మరిచిపోతున్నానే కాలనీలో నన్నంతా సుబ్బమ్మ మొగుడని పిలుస్తూంటే నాకు పరమానంద భరితంగా ఉంది తెలుసా? మురిసిపోతూ చెప్పాడు రామనాథం.

ఈ వెటకారాలే వద్దు! మెక్కారుగా... ఇక వెళ్లి మంచమెక్కండి!... అనవసరపు మాటలు నాకు నచ్చవు.

కుక్కిన పేనులా మారు మాట్లాడకుండా రామనాథం కంచంలో చేయి కడుక్కుని పడక గదిలోకి వెళ్లాడు. సిటి బస్సుకి చిల్లర ఏమైనా ఇస్తావా? బెగ్గర్లా చేయి చాచాడు రామనాథం.

'మీరు సంపాదిస్తున్నారు కదా... నన్ను అడుగుతారేం? సిగ్గుగా లేదా?'

సిగ్గు నాకెక్కడిదే సుబ్బా! నిన్ను చేసుకున్న తర్వాత అది అటకెక్కింది. ఫస్ట్ తారీకు తీసుకున్న జీతం మొత్తం తెచ్చి నీ దోసిట్లోనేగా పోస్తోంది.... వెర్రిముఖం వేశాడు రామనాథం.

ఇందా తగలడండి.. ఓ రెండు రూపాయల బిళ్ల చేతిలో ఉంచింది.

'ఇది చాల్తుందా?' అని నసిగేడు

చచ్చినట్టు సరిపోతుంది. సాయంకాలం నడిచిరావడం అలవాటుచేసుకోండి! నడక ఆరోగ్యానికి మంచిది. డాక్టర్లా సలహా ఇచ్చింది. మీకు బొజ్జ పెరుగుతోంది. ఇకపై మీకు భోజనం ఒంటిపూటే! రాత్రిళ్లు ఓ రెండు పుల్కాలు చేసి మీ ముఖాన పడేస్తాను! ఇంకా నిలబడ్డారేం? కదలండి. నాకు అవతల బోలెడు పనులున్నాయి. బతుకు జీవుడాని ఇంట్లోంచి బయటపడ్డాడు రామనాథం.

సుబ్బమ్మ కొట్లో కూర్చుంది.

అమ్మా సుబ్బమ్మ... అవసరం గొంతు మీదికొచ్చింది. ఈ ఇత్తడి బింఎ తాకట్టు పెట్టుకుని వేయి రూపాయలు అప్పు ఇప్పించడమ్మ... మీకు పుణ్యముంటుంది. కాళ్లావేళ్లాపడింది అక్కడికొచ్చిన ఆడమనిషి.

ఇదే నాకు నచ్చదు! సామాను పెట్టుకుని అప్పు ఇచ్చేది లేదు. బంగారం లేదా

వెండి అయితే ఇవ్వగలను అని నిక్కచ్చిగా మాట్లాడింది.

'పుస్తెలు తప్ప నావద్ద వెండి బంగారం ఏముంటుందమ్మా? నా మొగుడు తెచ్చే రోజువారీ కూలీ ఇంట్లో వాళ్ల తిండికే సరిపోవటంలేదు. అమ్మ... నీ కాళ్లు పట్టుకుంటాను. నా అవసరాన్ని గట్టెక్కించమ్మా...

చూడు శాంతమ్మా! నీ వెయ్యి రూపాయల చీటి నేనే పాడుకుంటాను. అందుకు సరేనంటే ఈ బిందె ఇక్కడ పెట్టు. నీకు డబ్బులిస్తాను ఆలోచించుకో!

సరేనమ్మా... అలాగే చేయండి.

బిందె అక్కడ పెట్టి సుబ్బమ్మ ఇచ్చిన డబ్బు పట్టుకెళ్లింది.

వడ్డీ వ్యాపారం... కుదవ బిజినెస్ కూడా బాగా సాగుతోంది. ఇప్పటికే నాలుగు లక్షలు కూడబెట్టగలిగింది. ఇదే మూలకు? పిల్లలేమో ఎదుగుతున్నారు. ఒకరి తర్వాత మరొకరిని అత్తారిల్లకు పంపాలంటే కనీసం యాభై లక్షలైనా చేతిలో ఉండాలి! అంత సంపాదించటానికి ఎన్నేళ్లు పడుతుందో!... సుబ్బమ్మ ఆలోచన పరిపరి విధాల పోతోంది.

అవునే సుబ్బా! మన డాబా ఇంటి మీద రెండు అంతస్తులు వేసుకోకూడదూ?

ఏంటీ? పరిహాసమా?... మీకొచ్చే లక్షల జీతంతో రెండు అంతస్తులేం కర్మ ఏకంగా నాలుగు అంతస్తులు కట్టిచవచ్చు. భర్తను చావు దెబ్బకొట్టింది సుబ్బమ్మ.

అవున్లేవే. నేనో చవట. వెధవను. గొప్ప చదువు చదివి పెద్ద ఉద్యోగం వెలగబెట్టలేని వాడినైపోతిని! నేనంటే నీకు అలుసే! నొచ్చుకున్నాడు రామనాథం.

ఇల్లు అమ్మేద్దామనుకుంటున్నానండీ అందామె.

అమ్మో అంతపని చేయొద్దు! అందరికీ నీడ లేకుండా పోతుంది. కష్టార్జితంతో ఏర్పరుచుకున్న ఇల్లిది.

ఇంత తెలివిలేని మొగుడువి నువ్వెక్కడ దొరికావయ్యా. పిల్లలకు ఈ సంవత్సరం టెన్త్ పరీక్షలు తర్వాత వాళ్ల కాలేజీల్లో చేర్పించాలి. ఆ తర్వాత అత్తగారి ఇంటికి పంపాలి. అందుకు బోలెడు డబ్బు అవసరపడుతుంది కదా? ఎక్కడ నుంచి వస్తుంది అంతడబ్బు?

ఏదో కొత్త ఆలోచన చెయ్యవే! చక్రం తిప్పు!

అంతే అంతే!... అన్నిటికీ ఆడదాన్ని నేనే ఏడవాలి. మీరు దేనికి పనికిరారు.

చురకేసింది సుబ్బమ్మ.

అవున్లే నేనేగా నీకు లోకువ నేనేదైనా మాస్టర్ ప్లాన్ వేస్తేగాని అవసరాలు తీరేట్టు లేవు.

నాకెందుకొచ్చిన గొడవ నాకు నిద్దరొస్తోంది. నే వెళ్లి పడుకుంటానంటూ అక్కడ్నించి జారుకున్నాడు రామనాథం.

X X X

సుబ్బమ్మది అంతా గుంభన వ్యవహారం ! భర్తతో కూడా కొన్ని విషయాలు చెప్పదు. ఒకరోజు రాత్రి...

'ఏమయ్యోయ్... నీ చెవి ఇటు పారేయ్'

ఏమిటో అంత రహస్యం?

మనం ఈ ఊరు విడిచి వెళ్లిపోతున్నాం.

ఆ మాటలకు రామనాథం గుండె గెభేలుమంది.

మరి నా ఉద్యోగం? వెర్రి మొహం వేశాడు.

నీ బోడి ఉద్యోగం వుంటేనేం వూడితేనే? నేను చేస్తున్న వ్యాపారాన్నింటికి మంగళం పాడేస్తున్నాను. అర్థమైందా?

ఎలా అర్థమౌతుంది నా బొంద! నువ్వు ఏం చెప్పకపోతివి.

ప్రస్తుతానికి నేను చెప్పింది మీరు విన్నది చాలు ఇక పడుకోండి!

రెండో కంటికి తెలియకుండా మార్వాడీకి ఇల్లు అమ్మి సొమ్ముచేసుకుంది.

కాలనీలో వాళ్లు చీట్టు కట్టిన డబ్బంతా మూటగట్టుకుని అర్థరాత్రి కార్లో, కుటుంబ సభ్యులతో జండా ఎత్తేసి వుడాయించింది సుబ్బమ్మ. రెండు మూడు రోజులు అవగానే సుబ్బమ్మ ఇల్లు అమ్మేసిందనే నిజం కాలనీ అంతా వ్యాపించింది. చీట్ల డబ్బు యాభై లక్షలతో కాలనీ వాసులందరికీ నామాలు పెట్టి సుబ్బమ్మ అదృశ్యమైనందుకు అబోదిబోమన్నారంతా!

ఎంత మోసం? ఎంత నయవంచన? ఏదైతేనేం అంతా మోసపోయామని గ్రహించి పోలీసు రిపోర్టు ఇచ్చారు. అందరూ ఏకమై టీవీ కవరేజీ, న్యూస్ పేపర్లలో

వార్తలు సుబ్బమ్మ గురించి ప్రముఖంగా చోటుచేసుకున్నా నష్టపోయిన వీరికి ఒరిగిందేమీ లేదు.

నమ్మి మోసపోయిన కాలనీ వాసులందరూ ఘొల్లుమంటూ నెత్తీరోరు బాదుకున్నారు.

ఇలాంటి కేసులె పోలీసులు ఇన్వెస్టిగేషన్ చేస్తూనే ఉంటారు. కాలం గడిచేకొద్ది నేరస్తులు దొరక్కపోవడంతో 'కల్ప్రిట్ నాట్ ట్రేస్ట్' అనే అభిప్రాయానికి వచ్చి కేసులు మూసివేయడం సర్వసాధారణమైన విషయం.

మోసపోయేవారు వున్నంతకాలం మోసం చేసేవారు చేస్తూనే ఉంటారు! ఇది లోక రీతి!

--- సమాప్తం---

(29-07-2012 ఆంధ్రప్రభ ఆదివారం సప్లిమెంట్‌లో అచ్చైంది)